epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:350

24 క్యారెట్లు 146,510.00 | కిలో వెండి 2,45,000.00 | chourastha Digitals | 23.07.2026 గురువారం, హైదరాబాద్

## మాకు వీడియోలుచూసే ఆసక్తి లేదు

సీజేఐ జస్టిస్ సూర్య కాంత్



2లో




## దేశ ప్రజలకు మోడీ క్షమాపణ చెప్పాలి

- ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలి
- శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవికంగా దాడులు చేస్తారా
- విద్యార్థులపై పాశవిక దాడిని ఖండిస్తున్నాం
- ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలు
- మోడీపై పోరాటానికి కాంగ్రెస్ సిద్ధం
- ఆయనను గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందాం
- కొడంగల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి

దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పి.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవికంగా దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల దాడిని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్‌లో భారీ నిరసనా ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి చిత్రాలతో కూడిన బ్యానర్‌తో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులతో కలిసి సీఎం కాలినడకన అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. నీట్ పేపర్ లీక్‌తో బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చిందని ఆరోపించారు.

2లో



# విద్యా విధానమే రిగ్గయ్యింది

**గత పదేళ్లలో 152 పేపర్లు లీక్ అయ్యాయి**

ఏ ఒక్కరికీ శిక్ష పడలేదు

ఒత్తిళ్లు తట్టుకోలేక విద్యార్థుల ఆత్మహత్య

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- విద్యార్థులపై దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి
- విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి
- పార్లమెంట్‌లో చర్చించక పోతే, ధర్నాలు తప్పవ్

మీడియా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో 152 సార్లు పేపర్లు లీకేజీలు జరిగాయని, అన్ని సార్లు పేపర్ లీకేజీలు జరిగినా ఒక్కరికి కూడా శిక్ష పడలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ సమీపం వరకు సోమ వారం విద్యార్థులపై అమానుషంగా లాఠీఛార్జ్ చేశారని రాహుల్ అన్నారు. నిరసనలు తప్ప విద్యార్థులు చేసిన నేరం ఏమిటని నిలదీశారు.దేశంలో విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో బుధ వారం ఆయన మీడి యాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. విద్యా వ్యవస్థలో నెల కొన్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకులు, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్ష పేపర్ల లీకులకు ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

ఎన్డీఏ సర్కారు పబ్లిక్ సెక్టార్లను ప్రైవేటీకరిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సర్కారు ముందు రాహుల్ గాంధీ మూడు డిమాండ్లు పెట్టారు. 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి, విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు.

**అన్నీ అక్రమాలే..**

'అందరికీ స్పష్టంగా కనిపిస్తున్న విషయం ఏంటంటే, ఒకప్పుడు ప్రపంచంలో అత్యుత్తమ విద్యా వ్యవస్థల్లో ఒకటిగా పేరొందిన మన విద్యా వ్యవస్థ ఇప్పుడు అక్రమాలతో నిండిన వ్యవస్థగా మారింది. గత 10 ఏళ్లలో 152 ప్రశ్నాపత్రాల లీకులు జరిగాయని మనకు తెలుసు. లెక్క వేస్తే నెలకు దాదాపు ఒకటి చొప్పున జరుగుతున్నట్టే. దీని ప్రభావం 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలపై పడింది. వీరంతా మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందినవారు.కష్టపడి సంపాదించిన డబ్బును పిల్లల చదువు కోసం ఖర్చు చేస్తున్నారు. చివరికి వారి ఆశలను పూర్తిగా అవమానిస్తున్నారు. ఇందులో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, ఒక్కరికీ శిక్ష పడలేదు. అంటే కొందరు వ్యక్తులు లేదా ఒక వర్గం మన విద్యా వ్యవస్థను, దేశంలో అత్యంత విలువైన సంపదైన విద్యార్థుల

।మిగతా 2 లో।



## ప్రభుత్వం సీసీఐ పునరుద్ధరణపై స్పష్టతనివ్వాలి

### సీసీఐ కేవలం ఒక పరిశ్రమ కాదని, వేలాది కుటుంబాలకు జీవనాధారం

- ఆదిలాబాద్‌లోని పరిశ్రమ పునరుద్ధరణపై ప్రతిపాదనలే లేవు
- 250 కోట్ల పెట్టుబడితో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే
- ఆదిలాబాద్ సీసీఐ ప్లాంట్ పునరుద్ధరణ అవుతుంది
- కానీ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఏం క్లారిటీ ఇవ్వలేదు
- ప్రభుత్వం తీరు క్షమించరానిది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారం పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. సీసీఐ కేవలం ఒక పరిశ్రమ కాదని, వేలాది కుటుంబాలకు జీవనాధారం, ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక భవిష్యత్తు, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశమని పేర్కొన్నారు. ఇటీవల సీసీఐ సాధన సమితి ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలతో కలిసి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని ఢిల్లీలో కలిసిన సందర్భంగా సీసీఐ పునరుద్ధరణపై కీలక చర్చ జరిగినట్లు కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రూ.250 కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తే ఆదిలాబాద్ సీసీఐ ప్లాంట్ పునరుద్ధరణ సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి తమకు స్పష్టం చేశారని వెల్లడించారు. ఇప్పటి వరకు

।మిగతా 2 లో।

## ఇరాన్ విద్యుత్ కేంద్రాల్ని బాంబులతో పేల్చేస్తాం

- మౌలిక సదుపాయాలపై వైమానిక దాడులు చేస్తాం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్ర స్థాయికి



**తెలంగాణ చౌరస్తా వెబ్ డెస్క్:**

హర్మూజ్ జలసంధి కేంద్రంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఈ వ్యూహాత్మక జలమార్గంలో రాకపోకలు సాగించే వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడుల్ని తీవ్రతరం చేయడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆ దేశానికి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిలో ఏదైనా ఓడపై ఇరాన్ దాడి చేస్తే, దానికి వెంటనే ప్రతీకారం ఉంటుందని, మౌలిక సదుపాయాలపై వైమానిక దాడులు జరుపుతామని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రతీ దాడికి బదులుగా టెహ్రాన్‌లోని నేరుగా ఒక ప్రధాన వంతెన లేదా విద్యుత్ ప్లాంట్‌ను అమెరికా

।మిగతా 2 లో।

## కేంద్రం హామీ ఇస్తే తక్షణమే దీక్ష విరమిస్తా

- లేకుంటే నిరాహార దీక్షను నిరవధికంగా కొనసాగిస్తా
- సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్
- విద్యార్థులపై కేంద్రం ఎలాంటి కేసులు పెట్టొద్దు
- కేంద్రానికి సోనమ్ వాంగ్‌చుక్ లేఖ
- విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించే అంశాన్ని పరిశీలిస్తున్నాం
- మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్

2లో





## కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

- నాంపల్లి రోడ్లో హైటెన్షన్
- గాంధీభవన్ ముట్టడికి యత్నించిన బీజేపీ నేతలు
- ఉద్రిక్తతల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు అరెస్టు
- పోటీగా బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ నేతలు
- ఉద్రిక్తత, పలువురి అరెస్టు



2లో

# విద్యా విధానమే రిగ్గయ్యింది



**తరువాయి భాగం**

భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఏం చేసింది? ఒక్క శిక్ష కూడా పడలేదు. వ్యవస్థ అక్రమాలతో నిండిపోయిందన్న విషయం ఒక్కటే కాదు, అది సామాన్య ప్రజలకు అందని స్థాయిలో ఖరీదుగా కూడా మారింది.ఈ గణాంకాలు ప్రతి యువకుడికి తెలుసు. కానీ భారత ప్రభుత్వం మాత్రం తెలుసుకోలేకపోతోంది. ఒక పరీక్ష రాసే కుటుంబాలు ఖర్చు చేస్తున్న మొత్తం, కేంద్ర ప్రభుత్వం విద్య కోసం కేటాయిస్తున్న మొత్తం బడ్జెట్‌కు దాదాపు సమానం. ప్రజల నుంచి పన్నులు వసూలుచేసిన తర్వాత, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఖర్చు చేసే నిధినే విద్యా బడ్జెట్ అంటారు. అది రూ.1.4 లక్షలకోట్లు. అదే సమయంలో, ప్రతి ఏడాది నీట్ పరీక్ష రాసే కుటుంబాలు కలిపి రూ.1.32లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఇది ఆ కుటుంబాల నుంచి జరుగుతున్న బహిరంగ దోపిడీ తప్ప మరొకటి కాదు. అంత డబ్బు ఖర్చు చేయించిన తర్వాత ప్రశ్నపత్రం లీక్ అయిందని చెబుతున్నారు. అంటే మొత్తం వ్యవస్థ అక్రమాలతో నిండిపోయింది. యువత వీధుల్లోకి రావడానికి ఇదే రెండో కారణం. అది పూర్తిగా సరైన కారణం' అని రాహుల్ అన్నారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, ఆయన ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని ధ్వజమెత్తారు. 'ఎవరో ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం మన విద్యా వ్యవస్థను, దేశ అత్యంత విలువైన ఆస్తిని నాశనం చేస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది?' అని ప్రశ్నించారు.

**అందుకే మెరుపు ధర్నా..**

విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాహుల్ దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి నివాసం వద్ద ప్రతిపక్ష నాయకుడు ధర్నాకు దిగడమేమిటి? అని బీజేపీ విమర్శించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. 'నీట్ పేపర్ లీక్‌పై, విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలనే అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని ఎన్నిసార్లు అడిగినా ప్రభుత్వం మిన్నకుంది. ఇక లాభంలేదని కాంగ్రెస్ ప్రధాని నివాసం వద్ద ధర్నా చేసింది. యువత ఆగ్రహాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి కదా. ప్రస్తుత పరిస్థితుల్లో మా ధర్నా తప్పు కాదు.'

# దేశ ప్రజలకు మోడీ క్షమాపణ చెప్పాలి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పి.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై పోరాటం చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పాశవికంగా దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల దాడిని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొడంగల్‌లో భారీ నిరసనా ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి చిత్రాలతో కూడిన బ్యానర్‌తో ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులతో కలిసి సీఎం కాలినడకన అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. నీట్ పేపర్ లీక్‌తో బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చిందని ఆరోపించారు.



బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నాపత్రాలను అమ్ముకుని బీజేపీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు చేపట్టిన నిరసనకు రాజకీయాలకు అతీతంగా ఆయా పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేసి, నీట్ పేపర్ లీక్ చేసిన బాధ్యులను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవికంగా దాడి జరుపుతారా అని ప్రశ్నించారు. విద్యార్థినులపై దుర్మారంగా దాడి చేయడమే కాకుండా.. విద్యార్థుల తలలు పగులగొట్టారని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ప్రధాని ఇంటి ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపితే వారిపై పాశవికంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఈ దాడిలో రాహుల్ గాంధీ రక్తం నేలకు చిందిందని, దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని గుర్తు చేశారు. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఇద్దరూ కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ అని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 2019లో ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని గుర్తు చేశారు. ఆ సంస్థ 27 మంది విద్యార్థుల ప్రాణాలు బలిగొందని తెలిపారు. అనుభవం, అర్హత లేకపోయినా రాజకీయ ఒత్తిళ్లతో ఆనాడు కేటీఆర్ తన బినామీ సంస్థ గ్లోబరీనాకు ప్రాజెక్టును అప్పగించారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని గ్లోబరీనా సంస్థ కోఎంప్ట్ ఎడ్యుటెక్‌గా పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందన్నారు. ఢిల్లీ బీజేపీ నేతలతో మాట్లాడుకుని వాళ్లకు కేటీఆర్ కాంట్రాక్టు ఇప్పించారని తెలిపారు. దీంతో నీట్ పరీక్ష నిర్వహించడంతో అవకతవకలకు పాల్పడొచ్చన ధైర్యం వాళ్లకు వచ్చిందన్నారు. బీజేపీ దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. విద్యార్థులు, యువత పక్షాన నిలిచి.. మోడీపై పోరాటానికి సిద్ధంగా ఉండన్నారు. అందరం కలిసి పోరాడి మోడీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ప్రభుత్వం సీసీఐ పునరుద్ధరణపై స్పష్టతనివ్వాలి

**తరువాయి భాగం**

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు, రాయితీలు లేదా సహకారంపై స్పష్టత లేకపోవడం వల్లే ప్రక్రియ ఆలస్యమవుతోందని కేంద్ర మంత్రి చెప్పినట్లు లేఖలో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, గత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. కేంద్రంతో కలిసి ముందుకు వెళ్లడం సాధ్యం కాకపోతే, రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా పరిశ్రమను పునరుద్ధరించే ప్రత్యామ్నాయ ప్రణాళికను కూడా ప్రకటించలేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా సీసీఐని తిరిగి ప్రారంభిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంతో ఇప్పటివరకు అధికారిక చర్చలు జరపకపోవడం, అవసరమైన ప్రతిపాదనలు పంపకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీసీఐ పునరుద్ధరణ కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానమంత్రికి లేఖ రాశారని, తాను పరిశ్రమల శాఖ మంత్రిగా కేంద్ర భారీ పరిశ్రమల శాఖకు పలుమార్లు విజ్ఞప్తి చేశానని కేటీఆర్ గుర్తు చేశారు. టీఎస్‌ఐపాస్ కింద అన్ని రాయితీలు ఇవ్వడంతో పాటు, కేంద్రరాష్ట్ర భాగస్వామ్యంతో పరిశ్రమ నిర్వహించేందుకు, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని నడిపేందుకు కూడా సిద్ధమని అప్పట్లో ప్రతిపాదించామన్నారు. అయితే అప్పట్లో రాజకీయ కారణాలతో కేంద్రం ముందుకు రాలేదని, ఇప్పుడు మాత్రం రాష్ట్రప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారన్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం మౌనం పాటించడం క్షమించరానిదని అన్నారు.



# ఇరాన్ విద్యుత్ కేంద్రాల్ని బాంబులతో పేల్చేస్తాం

**తరువాయి భాగం**

బాంబులతో పేల్చేసి, పూర్తిగా ధ్వంసం చేస్తుందని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో ఘర్షణలు మళ్లీ ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'ఇప్పటి నుంచి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ హర్మూజ్ జలసంధిలో ఏదైనా ఏ ఓడపై అయినా మిసైల్, రాకెట్, డ్రోన్ లేదా ఇతర ఏ ఆయుధంతో అయినా దాడి చేస్తే, అమెరికా వెంటనే ఇరాన్ రాజధాని టెహ్రాన్ నగరంలో లేదా దాని సమీపంలో ఉన్న ఒక వంతెనను లేదా విద్యుత్ ప్లాంట్‌ను బాంబులతో ధ్వంసం చేస్తుంది.' అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొద్ది రోజుల కిందట యుద్ధ విరమణకు సంబంధించి కుదిరిన తాత్కాలిక ఒప్పందాన్ని లెక్కచేయకుండా ఇరు దేశాలు మళ్లీ భీకర దాడులు చేసుకుంటున్నాయి. దీంతో గల్ఫ్ ప్రాంతంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. గతంలో కూడా ఇరాన్ పౌర మౌలిక సదుపాయాల్ని లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించిన ట్రంప్ ఇప్పుడు మరోసారి అదే వైఖరిని పునరుద్ఘాటించారు. ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు జరిగే హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరగడం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఇప్పటికే క్రూడాయిల్ ధరలు భారీగా పెరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు.

ఇదిలా ఉండగా అమెరికా సెంట్రల్ కమాండ్ (CENTCOM) వరుసగా 11వ రాత్రి అయిన మంగళవారం కూడా ఇరాన్ సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ప్రకటించింది. వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం కలిగించే ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపరచడమే ఈ చర్యల లక్ష్యమని వెల్లడించింది. ఇక్కడ ఇరాన్‌తో దౌత్య చర్చలకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ, ఇరాన్ అంత సీరియస్‌గా లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మండిపడ్డారు. అంతర్జాతీయ జలమార్గాలపై ఇరాన్ ఆధిపత్యం చూపించడం లేదా సుంకాల్ని వసూలు చేయడాన్ని అంగీకరిస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు.



# మాకు వీడియోలుచూసే ఆసక్తి లేదు

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. "మాకు వీడియోలు చూసే ఆసక్తి లేదు, అంత సమయం కూడా లేదు" అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానిస్తూ, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలపై జోక్యం చేసుకోవాలన్న అభ్యర్థనను తోసిపుచ్చారు. బుధవారం నాటి విచారణలో ఓ లాయర్ ఈ అంశాన్ని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ప్రస్తావిస్తూ, కోర్టు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించాలని కోరారు. అయితే ధర్మాసనం అందుకు స్పష్టంగా నిరాకరించింది. "మా సమయాన్ని వృథా చేయకండి, మీ సమయాన్ని కూడా పాడుచేసుకోకండి" అని లాయర్‌కు సీజేఐ హితవు పలికారు. నీట్ యుజి పేపర్ లీక్, ఇతర పరీక్షల అక్రమాలపై 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రధానంగా నిరసనలు నిర్వహిస్తోంది. నిరుద్యోగ యువత జర్నలిజం, సామాజిక ఉద్యమాల వైపు రావడంపై గతంలో సీజేఐ సూర్య కాంత్ స్పందిస్తూ 'కాక్రోచ్' (బొద్దింకలు) అనే పదాన్ని వాడగా, ఆ వ్యాఖ్యల ఆధారంగానే ఈ వ్యంగ్య వేదిక ఏర్పడటం గమనార్హం. ఆ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో, తాను నకిలీ డిగ్రీలు ఉన్న వారిని ఉద్దేశించి మాత్రమే ఆ మాట అన్నానని సీజేఐ తదనంతరం వివరణ ఇచ్చారు.

# కేంద్రం హామీ ఇస్తే తక్షణమే దీక్ష విరమిస్తా

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలో నిరసనలు చేస్తోన్న విద్యార్థులపై ఎలాంటి కేసులు ఉండవని కేంద్రం హామీ ఇస్తే తాను తక్షణమే నిరాహార దీక్ష విరమిస్తానని ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తెలిపారు. కేంద్రం ఎలాంటి హామీ ఇవ్వకపోతే నిరాహార దీక్షను నిరవధికంగా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాసిన వాంగ్‌చుక్ నీట్ పేపర్ల లీకేజీ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తనకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. బాధ్యులను జవాబుదారీ చేసేందుకు పార్లమెంటులో అర్థవంతమైన చర్చ జరపడం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశాలను కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు లేఖలో పేర్కొన్నారు. ఆందోళనలో పాల్గొన్న యువతపై భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రావాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు పోలీసులను ఎక్కువగా ఉపయోగించొద్దని తాను కోరుతున్నట్లు వాంగ్‌చుక్ వెల్లడించారు. ప్రభుత్వంతో చర్చలు జరపాలని విద్యార్థులకు చెబుతానని వాంగ్‌చుక్ తెలియజేశారు.

జులై 20న జరిగిన 'ఛలో సంసద్' మార్చ్ గురించి ప్రస్తావిస్తూ, పోలీసుల అకృత్యాలు, విపరీతమైన బలప్రయోగం ఉన్నప్పటికీ అది చాలా శాంతియుతంగానే కొనసాగింది. ప్రజాస్వామ్య నిరసన పట్ల విద్యార్థుల సహనాన్ని, నిబద్ధతను యావత్ దేశం, ప్రపంచం చూశాయి. ఇందులో పాల్గొన్న వారిపై ఎలాంటి చట్టపరమైన కేసులు, వేధింపులు లేదా కక్షపూరిత చర్యల ద్వారా ప్రజాస్వామ్య సంస్థలపై ఉన్న ఈ విశ్వాసం మరింత దెబ్బతినకుండా ఉంటుందని మనఃస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 65 మంది ఎంపీలు తనకు లేఖలు రాశారని, మరికొందరు స్వయంగా కలిసి తన నిరాహార దీక్షను విరమించుకోవాలని కోరారని వాంగ్చుక్ చెప్పారు. దేశ సేవలో ఇంకా ఎంతో పనిచేయాల్సి ఉందని గుర్తు చేస్తూ వారంతా నన్ను దీక్ష విరమించమని కోరారు. నేను వారితో ఏకీభవిస్తున్నాను. నేను జీవించాలని కోరుకుంటున్నాను. విద్యార్థుల వద్దకు, నా జీవితానికి అర్థాన్నిచ్చిన పనికి తిరిగి వెళ్లాలని నేను అనుకుంటున్నాను. కానీ ఏ యువత కోసం అయితే ఈ ఉద్యమం మొదలైందో, వారిని పణంగా పెట్టి నేను అలా చేయలేను" అని అన్నారు.

పోటీ పరీక్షల్లో అక్రమాలపై ఆందోళనను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. ఐతే, ఈ చర్చలు మంత్రి నివాసంలో కాకుండా తటస్థ ప్రదేశంలో జరగాలని సీజేపీ స్పష్టంచేసింది. కేంద్రమంత్రి జె.పి. నడ్డా చర్చలు జరపాలని కోరుకుంటున్నారని, తన నివాసానికి రావాలని ఆహ్వానించారని పోలీసులు తమకు చెప్పారని తెలిపారు. చర్చలతో సమస్య పరిష్కారం కావాలని కోరుకుంటున్నామన్న సీజేపీ, అర్థరహితమైన చర్చల కోసం తమకు సమయం లేదని, తమ డిమాండ్లను నిజాయితీగా పరిష్కరించాలని కోరింది. నిరసనకారులను శిక్షించబోమని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. కాగా ముందు జాగ్రత్త చర్యగా ఉదయం నుంచి 16 మెట్రో స్టేషన్లను మూసివేసిన ఢిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ సాయంత్రం పునరుద్ధరించింది. మరోవైపు సోనమ్ వాంగ్చుక్ నిరాహార దీక్ష విరమించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) బుధవారం విజ్ఞప్తి చేసింది. దేశంలోని విద్యార్థులకు వాంగ్చుక్ త్యాగం స్ఫూర్తినిచ్చిందని, తమ డిమాండ్లు నెరవేరే వరకు పరీక్షల్లో అవకతవకలపై ఆందోళన కొనసాగుతుందని ఆయనకు హామీ ఇచ్చింది. ఈ మేరకు వాంగ్చుక్కు ఓ బహిరంగ లేఖ రాసింది. న్యాయం కోసం తమ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని, అయితే వాంగ్చుక్ తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీజేపీ కోరింది






# కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్ద రాహుల్ గాంధీ నేతృత్వంలో ధర్నా చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ గాంధీ భవన్ ముట్టడికి యత్నించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నేతృత్వంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి గాంధీ భవన్ భవన్ ముట్టడికి బయల్దేరిన కాషాయ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం సమీపంలో బారికేడ్లు వేసి బీజేపీ నేతలను నిలువరించారు. దీంతో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాషాయ శ్రేణులకు పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో పాటు కాషాయ శ్రేణులను అరెస్ట్ చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్కు తరలించారు. మరోవైపు బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు గాంధీ భవన్ వద్ద ఉన్న కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించివేశారు. లోక్ భవన్ను ముట్టడించే నైతిక హక్కు కాంగ్రెస్కు లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. రాహుల్ గాంధీ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. ప్రతిపక్ష నేతగా చర్చకు రమ్మంటే పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విదేశీ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. విదేశీ కుట్రలకు రాహుల్ గాంధీ వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. బీజేపీ నేతలు గాంధీభవన్ ముట్టడిని నిరసిస్తూ పోటీగా బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు యత్నించాయి. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు, ఎన్ఎస్యూఐ కార్యకర్తలు బీజేపీ ఆఫీస్ ముట్టడికి యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలోనే బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం ఒకరిపైకి ఒకరు కర్రలు, రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడిలో ఓ మహిళా కానిస్టేబుల్ కాలికి గాయమైంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల ముట్టడులతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నాంపల్లి నుంచి ఎంజీబీఎస్ వెళ్లే మార్గంలో వాహనాల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# వన్ డే–వన్ వార్డ్

- ఆల్విన్ కాలనీ సమస్యలపై సమీక్ష
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- అధికారులకు ఆదేశాలు
- PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన "వన్ డే-వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని ఫేస్-1 ప్రాంతంలో బుధవారం సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులు, ప్రజల నుంచి వచ్చిన వినతుల పై అధికారులు, ప్రజాప్రతినిధులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. సృజన, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి, ఆల్విన్ కాలనీ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, వివిధ విభాగాల అధికారులు, స్థానిక నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ వన్ డే-వన్ వార్డ్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కాలనీల రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు, పార్కులు, వర్షపు నీటి కాలువలు వంటి పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల అవసరాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఆల్విన్ కాలనీ డివిజన్‌ను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని గాంధీ పేర్కొన్నారు. నాణ్యమైన సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, నిరంతర తాగునీటి సరఫరా, మెరుగైన వీధిదీపాలు, పార్కు లు, ఓపెన్ జిమ్ లు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న నాలాల విస్తరణ పనులను వెంటనే పూర్తి చేసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే రోడ్ల మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, అవసరమైన నిధుల విడుదల వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా



ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి మళ్లించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుధ్య సిబ్బందికి అందజేయడం ద్వారా పరిశుభ్రమైన కాలనీల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, జలమండలి తదితర విభాగాల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నల్లచెరువు అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశం

**కూకట్ పల్లి తెలంగాణ చౌరస్తా:**

కూకట్‌పల్లి లోని నల్లచెరువు పరిసర ప్రాంతాన్ని బుధవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. చెరువు అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని హైడ్రా అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లచెరువు వద్ద ప్రజలకు అత్యవసరంగా అవసరమైన ఆధునిక టాయిలెట్లు, తాగునీటి సదుపాయం, ఇండోర్ స్టేడియం, యోగా కేంద్రం వంటి సౌకర్యాల నిర్మాణాన్ని ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని అధికారులను కోరారు. అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే అవసరమైన నిధులను తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మంజూరు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నల్లచెరువు సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైడ్రా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న టాయిలెట్లు, తాగునీటి సౌకర్యాలు సహా ఇతర మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

అదేవిధంగా నల్లచెరువు నిర్వహణ బాధ్యతలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కి బదిలీ చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని, తద్వారా చెరువు పరిసరాల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు, జనరల్ సెక్రటరీ ప్రభాకర్, సీనియర్ నాయకుడు తులసీరావు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, హైడ్రా అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకవైపు ప్రగతి.. మరోవైపు వివాదాలు.

# నష్టపోయేది విద్యార్థులేనా?

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు విద్యాబోధన, ఫలితాల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తూ వార్తల్లో నిలుస్తుంటే.. మరోవైపు విచారణలు, ఆరోపణల వివాదాలతో వార్తలకెక్కి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రిన్సిపల్ కాశీమల్ల సుధాకర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కళాశాల రూపురేఖలు మారాయని ఒక వర్గం స్పష్టం చేస్తోంది. ఒకప్పుడు కేవలం 130 మంది విద్యార్థులతో ఉన్న ఈ కళాశాలలో, ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్, క్రమశిక్షణ చర్యల వల్ల ప్రవేశాలు 281కి పెరిగాయి. అంతేకాకుండా ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 96 శాతం, ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోంది. మరోవైపు కళాశాల ప్రిన్సిపల్ మీద పలు ఆరోపణలపై వచ్చిన పిర్యాదుల పై ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారుల త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఈ కమిటీ సభ్యులు గుండారం కళాశాలను సందర్శించి అధ్యాపకులు, సిబ్బంది నుంచి లిఖితపూర్వక వాంగ్మూలాలను సేకరించారు. అయితే, ఈ విచారణపై ప్రిన్సిపాల్ సుధాకర్ తీవ్రంగా స్పందించారు. తనపై వచ్చిన



ఆరోపణలన్నీ అవాస్తవాలని, అనామక లేఖల ఆధారంగా విచారణ జరపడం సరికాదన్నారు. అంతేకాకుండా ఈ విచారణపై కోర్టు మధ్యంతర ఉత్తర్వులు (స్టే) ఉన్నప్పటికీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

**వివాదాల సుడిగుండంలో ప్రభుత్వ విద్య...**

ఏది ఏమైనప్పటికీ, ఒకవైపు మంచి ఫలితాలు సాధిస్తూ మోడల్ కళాశాలగా ఎదుగుతున్న తరుణంలో.. ఇలాంటి వివాదాలు, విచారణల పర్వం సాగడం విద్యా వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఫిర్యాదుల్లోని నిజానిజాలను అధికారులు పారదర్శకంగా తేల్చి, వివాదాలకు త్వరితగతిన ముగింపు పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే, అంతిమంగా నష్టపోయేది గ్రామీణ పేద విద్యార్థుల భవిష్యత్తేనని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అర్ధరాత్రి వరకు పాన్ షాప్‌లు తెరిస్తే జైలే

- ఇద్దరికి రెండు రోజుల శిక్ష విధించిన కోర్టు
- చర్లపల్లి జైలుకు తరలింపు

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

అర్థరాత్రి వరకు నిబంధనలకు విరుద్ధంగా పాన్ షాపులు తెరిచి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న ఇద్దరు వ్యక్తులకు కోర్టు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.హయత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్‌కు చెందిన గుడెల్లి యాకయ్య (40),అమంగల్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ (41) నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వేళల్లో పాన్ షాపులు నిర్వహిస్తు..నేరస్థులు, అనుమానాస్పద వ్యక్తులు సంచరించేందుకు అవకాశం కల్పిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.కేసు విచారించిన న్యాయమూర్తి నిందితులిద్దరికీ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు.



**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు:**

నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వేళల్లో పాన్ షాపులు,టీ దుకాణాలు ఇతర వ్యాపార సముదాయాలు తెరిచి ఉంచితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ పోలీసులు హెచ్చరించారు.వ్యాపారులు పోలీసు శాఖ నిర్దేశించిన సమయాలను తప్పనిసరిగా పాటించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.



# చలో లోక్ భవన్ నిరసన విజయవంతం

- రాహుల్ గాంధీ అరెస్టును ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు

**కూకట్ పల్లి,తెలంగాణ చౌరస్తా:**

విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసం వద్ద శాంతియుత ధర్నా సందర్భంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన "చలో లోక్ భవన్" నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేంద్ర ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ నుంచి లోక్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, టీపీసీసీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సారథ్యంలో కూకట్ పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు, యువత భవిష్యత్తు కోసం గళం విప్పుతున్న రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ప్రజల సమస్యలను ప్రస్తావించే ప్రతిపక్ష నాయకుల గొంతును అణచివేయాలనే కేంద్ర ప్రభుత్వ వైఖరి ఆందోళన కలిగిస్తోందని విమర్శించారు. విద్య, ఉపాధి, యువత సంక్షేమానికి సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ వెనక్కి తగ్గదని దేశంలోని విద్యార్థులు, యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని బండి రమేష్ స్పష్టం చేశారు.



# ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలి

- బీఆర్ఎస్ శ్రేణుల డిమాండ్

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు, స్టాఫ్ నర్సుల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగగా, పోలీసులు వచ్చి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో కనీస వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బంది క్వార్టర్లు కూలిపోయేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిని వెంటనే 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాటికొండ శంకర్, బొమ్మగాని అనిల్ గౌడ్, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, మేకల సంపత్ యాదవ్, గుర్రం లక్ష్మీమల్లు, గాదె సదయ్య, రాచకొండ రవి తదితరులు పాల్గొన్నారు.



# పత్తి రైతులకు అలెర్ట్

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ మండలంలో రైతులు సాగు చేసే పత్తి పంటల్లో త్రిప్స్ (Thrips) పురుగు ఉధృతి కనిపిస్తున్న నేపథ్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరిఖిల్లా శాస్త్రవేత్తలు డా. వై. వెంకన్న, డా. కిరణ్ పిల్లి, మండల వ్యవసాయ అధికారి జి. రామకృష్ణ, ఏఈఓ నవీన్‌లతో కలిసి రైతుల పొలాలను పరిశీలించారు. ఆకులపై వెండి మచ్చలు, ఆకులు ముడుచుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే నివారణకు లీటరు నీటికి 0.8 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ కలిపి పిచికారీ చేయాలని లేదా కాండం వద్ద (1:20 నిష్పత్తిలో) వేయాలని సూచించారు. నేలలో తేమ ఉన్న పొలాల్లో ఎకరానికి 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ అందించాలని, తేమ లేకపోతే లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే, విత్తనాలు మొలకెత్తక ఏర్పడిన ఖాళీల్లో కందిని అంతర పంటగా విత్తుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు.

# నీట్ అక్రమాలపై కేంద్రాన్ని వదిలేది లేదు

- మంత్రి శ్రీధర్ బాబు
- యూత్ కాంగ్రెస్ 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో మంత్రి వ్యాఖ్యలు
- కేంద్ర హోంమంత్రి, విద్యాశాఖ మంత్రులు వెంటనే రాజీనామా చేయాలి






**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల కళాశాలలో నిర్వహించిన ఛాత్రోంకీ గూంజ్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు సికిందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బీజేపీ పాలనలో దేశంలో విద్యారంగం తీవ్రంగా దెబ్బతిన్నదని విమర్శించారు.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని..నీట్ పేపర్ లీకేజీ వల్ల వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల తరపున పోరాడుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అణచివేత ధోరణి ప్రదర్శిస్తోందని మండిపడ్డారు.నీట్ లీకేజీపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించి, పార్లమెంట్ లో తక్షణమే చర్చించాలని అలాగే ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా,విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలీద్, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు యరమల రామచంద్రారెడ్డి, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, కార్యదర్శి పాలడుగు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో 3,000 నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ

- ఫినిక్స్ ఫౌండేషన్ డైరెక్టర్ చుక్కపల్లి మధుమతి పుట్టినరోజు సందర్భంగా

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**

ఫినిక్స్ ఫౌండేషన్ డైరెక్టర్ చుక్కపల్లి మధుమతి పుట్టినరోజు సందర్భంగా బుధవారం అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని ఐదు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఫినిక్స్ ఫౌండేషన్, వావ్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కుంట్లూర్ , మత్తుగూడ, రాజీవ్ గృహకల్ప,రావి నారాయణరెడ్డి కాలనీ, జాఫర్‌గూడ ఎంపీపీ స్కూళ్లలోని విద్యార్థులకు 3,000 నోట్‌బుక్స్, 500 స్టేషనరీ కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫినిక్స్ ఫౌండేషన్ ప్రతినిధి మేకల రమేష్,వావ్ ఫౌండేషన్ ప్రతినిధి నర్సింగ్ రావు, మండల విద్యాధికారి జగదీశ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కట్ట సునీత,నందు సింగ్,పార్డ్ ఇండియా ఎరైజ్ సొల్యూషన్స్ కార్యదర్శి బోడపాటి బ్రహ్మయ్య, సరోజిని తదితరులు పాల్గొన్నారు. పేద విద్యార్థులకు సహాయం అందించడం అభినందనీయమని ప్రతినిధులు పేర్కొన్నారు.

# మోదీ నిరంకుశత్వానికి రాహుల్ గాంధీ అరెస్టే నిదర్శనం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు

**అశ్వాపురం, భద్రాద్రి బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

దేశంలో మోదీ ప్రభుత్వ నిరంకుశ పాలనకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టే ప్రత్యక్ష నిదర్శనమని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచనల మేరకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని



ప్రధాన కూడలి వద్ద మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఓరుగంటి రమేష్ బాబు మాట్లాడుతూ... పోటీ పరీక్షల పేపర్ లీకేజీల కారణంగా దేశంలోని లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తు అంధకారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాలని, నిరుద్యోగుల తరపున ప్రశ్నించిన రాహుల్ గాంధీని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు



## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ దుర్మార్గం

- ఐక్య వేదిక నాయకుల ఆగ్రహం నీట్ పేపర్ లీకేజీ
- తక్షణమే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పణ
- బాబు జగ్జీవన్ రావు వారసుల ఐక్య వేదిక

**పాల్వంచభద్రాద్రి బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూ నీట్ (నీట్ ) ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ కావడం అత్యంత బాధాకరమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు వారసుల ఐక్య వేదిక నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు ఏళ్ల తరబడి రాత్రింబవళ్లు కష్టపడి రాసిన పరీక్ష పేపర్లు లీక్ అవ్వడం వారి కలలను కల్లలు చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీఛార్జ్ చేయడం, అక్రమంగా అరెస్టులు చేసి కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య సూత్రాలకు కేవలం విరుద్ధమే కాకుండా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక నిరసన హక్కుకు భంగం కలిగించడమేనని స్పష్టం చేశారు.

ఈ మేరకు విద్యార్థులకు తక్షణమే న్యాయం చేయాలంటూ సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. లీకేజీకి గురైన నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి పారదర్శకంగా మళ్లీ నిర్వహించాలని, శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై మోపిన అక్రమ కేసులన్నింటినీ బేషరతుగా ఎత్తివేయాలని ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఈ పేపర్ లీకేజీ కుంభకోణానికి బాధ్యులైన ఎంతటి వారినైనా చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ గార్ల ఆశయాల మేరకు విద్యార్థి లోకానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు వానపాకుల రాంబాబు, తెలంగాణ ఉద్యమ నాయకులు అల్లూరి సాంబశివరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు కత్తి శ్రీనివాసరావు, శివాటి మల్లేష్, గంగాధరి సురేందర్, కె. అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులపై లాఠీ ఛార్జీ దుర్మార్గం

- మోడీ దిష్టి బొమ్మ దగ్ధం
- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్

**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా**

ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసు దాడిని నిరసిస్తూ రామన్నపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళనకు దిగారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పున్న జగన్మోహన్ మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కడమేనని విమర్శించారు. విద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసనను అడ్డుకోవడంతో పాటు ఆయనపై దాడి చేయడం కేంద్ర ప్రభుత్వ పిరికిపంద చర్యకు నిదర్శనమన్నారు. దేశంకోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబంపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు విద్యార్థులపై జరిగిన దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జమీరుద్దీన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, ఉప సర్పంచ్ మోటే రమేష్, జింకల ప్రభాకర్ రెడ్డి, బొడ్డు సాలయ్య, సాల్వేర్ అశోక్, వనం చంద్రశేఖర్, మొహమ్మద్ నాసర్, మొహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్, మోటే మహేష్, మొహమ్మద్ అంజాత్, కేశవదాసు వెంకటేష్, మీర్జా అస్లం బేగ్, నోముల ప్రవీణ్ కుమార్, మొహమ్మద్ రిజ్వాన్, లెక్కల ప్రవీణ్, మొహమ్మద్ అజార్, బండ అంజిరెడ్డి, కొండ శేఖర్ గౌడ్, గడ్డం యాదగిరి, మీర్జా ఇనాయతుల్లా బేగ్, చింతల కృష్ణ, స్వామి, దామోదర్ రెడ్డి, లవణం సాయి, ఎండీ సమీర్, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.






## నైపుణ్య శిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- సమయాన్ని వృథా చేయకుండా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి
- అశ్వారావుపేటలో ఉచిత గిరిజన శిక్షణా కోర్సులు ప్రారంభం


**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

గిరిజన యువతను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. భద్రాచలం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలోని గిరిజన యువత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి శిక్షణ కోర్సుల వివరాలను విద్యార్థులకు వివరించారు. సమయాన్ని వృథా చేయకుండా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచిస్తూ... "కాలం అందరికీ ఒకే సమయాన్ని ఇస్తుంది, కానీ దాన్ని ఎలా వాడుకుంటారనేదే గమ్యాన్ని నిర్ణయిస్తుంది" అని స్పష్టం చేశారు. స్వయంప్రతిపత్తి మరియు ప్రైవేట్ రంగంలో వస్తున్న అవకాశాలను అందుకోవడానికి సరైన శిక్షణ ఎంతో అవసరమని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు భయపడకూడదని హితవు పలికారు.పద్దెనిమిది నుండి ముప్పై ఐదు సంవత్సరాల వయస్సు కలిగిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఈ శిక్షణ ఇస్తారు. తొమ్మిదో తరగతి అర్హత ఉన్న వారికి సమాచార నమోదు నిపుణుడు, స్వయం ఉపాధి కుట్టు పని కోర్సులు అందుబాటులో ఉంటాయి. పదో తరగతి అర్హత ఉన్న వారికి సౌందర్య పోషణ, పార్శిళ్ల రవాణా సహాయకుడు, పెళ్లిళ్ల ప్రత్యేక అలంకరణ విభాగాల్లో శిక్షణ ఇస్తారు. వీటితో పాటు అదనంగా సమాచార సాంకేతిక నైపుణ్యాలు, కృత్రిమ మేధస్సు వినియోగం, చిత్రాల రూపకల్పన, గణన పత్రాల వినియోగం, కార్యాలయ నిర్వహణ, ఆంగ్ల సంభాషణ మరియు వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలలో శిక్షణ ఇస్తారు.శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి, దుస్తులు, అధ్యయన సామగ్రి ఉచితంగా అందిస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత ప్రభుత్వ గుర్తింపు పొందిన ధృవీకరణ పత్రంతో పాటు ప్రముఖ సంస్థలలో వంద శాతం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వివరించారు. అశ్వారావుపేట నియోజకవర్గాన్ని, ఇక్కడి గిరిజన యువతను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ప్రధాన బాధ్యత అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆసక్తిగల అభ్యర్థులు అశ్వారావుపేటలోని 'గిరిజన భవన్' లో సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు రాహుల్, పురపాలక సంఘం ఉప అధ్యక్షుడు జూపల్లి రమేష్ బాబు, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ కమిటీ అధ్యక్షుడు సుంకవల్లి వీరభద్రం, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ అధికారి డేవిడ్ రాజు, గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు.

# రూ.5 కోట్ల అభివృద్ధి... దొంతికుంటకు ముప్పు

- అభివృద్ధి పేరిట దొంతికుంట సంకోచం
- అశ్వారావుపేటలో ఐదెకరాల చెరువు కనురుగు?
- వాకింగ్ ట్రాక్‌తో ముంపు ముప్పు... అశ్వారావుపేటను చెరువుగా మారుస్తారా.. ఆయకట్టు రైతుల నిరసన
- నా 17వ వార్డును కాపాడండి
- ఇరిగేషన్ అధికారులను వేడుకున్న కౌన్సిలర్ పమిడి గీత శ్రీ
- ఇన్‌ఫ్లో ఆక్రమణలు వదిలి... చెరువును మింగేస్తున్న ట్రాక్ నిర్మాణం
- వర్షం వస్తే బజార్లు జలమయం
- అధికారుల నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగిన ప్రజలు
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాల్సిందే
- దొంతికుంట ఆక్రమణలపై రైతుల హెచ్చరిక






**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట పట్టణానికి ప్రాణాధారంగా, చారిత్రాత్మక ఆనవాళ్లుగా నిలిచిన దొంతికుంట చెరువు ప్రస్తుతం తీవ్ర వివాదాలకు, స్థానిక నిరసనలకు నిలయంగా మారింది. ప్రభుత్వం సుమారు రూ.5 కోట్ల భారీ నిధులతో చేపడుతున్న ఈ చెరువు అభివృద్ధి, సౌందర్యీకరణ మరియు వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు ప్రజా సౌకర్యార్థం కాకుండా, పట్టణ భవిష్యత్తుకు శరాఘాతంగా మారబోతున్నాయని ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆధునీకరణ పేరిట చెరువు సహజ రూపాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నారని, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన ఇరిగేషన్ అధికారులు విరుద్ధంగా చెరువు విస్తీర్ణాన్ని కుదించేలా వ్యవహరిస్తున్నారని ఇరిగేషన్ డీఈ.ని స్థానికులు, రైతులు నేరుగా నిలదీశారు. రైతులు మరియు ఆయకట్టు దారుల తీవ్ర ఆరోపణల ప్రకారం చెరువు చుట్టూ సుమారు 8 మీటర్ల వెడల్పుతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ వల్ల దాదాపు ఐదు ఎకరాల మేర చెరువు విస్తీర్ణం కనుమరుగవుతోంది.

చెరువులో పూడిక తీసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి, రైతుల ఆయకట్టుకు పుష్కలంగా నీరందించాల్సిన ఇరిగేషన్ శాఖ, దానికి వ్యతిరేకంగా చెరువు విస్తీర్ణాన్ని తగ్గిస్తూ ఎత్తైన కట్టలు కట్టడం ఏ రకమైన ఇంజనీరింగ్ అని ఆయకట్టు రైతులు తీవ్రస్థాయిలో ప్రశ్నిస్తున్నారు. గతంలో చెరువులోకి సహజంగా వచ్చే నీటి కాలువలపై జరిగిన అనేక ఆక్రమణలను అధికారులు ఇప్పటివరకూ తొలగించకుండా నిర్లక్ష్యం వహించారు. ఆక్రమణలను అలాగే వదిలేసి, చెరువు చుట్టూ ఎత్తైన కట్టను నిర్మించడం వల్ల వర్షపు నీరు చెరువులోకి చేరే సహజ మార్గాలు పూర్తిగా మూసుకుపోతున్నాయి. దీనివల్ల స్మశానవాటికతో పాటు పరిసర నివాస ప్రాంతాలు వర్షాకాలంలో తీవ్ర ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. జంగారెడ్డిగూడెం రోడ్డు వైపు నుంచి వచ్చే నీటి తూములు. తీవ్రంగా పూడిపోవడం, వర్షపు నీటి ప్రవాహానికి పదే పదే అడ్డంకులు ఏర్పడటంతో చిన్నపాటి వర్షానికే గౌడ్ బజార్, మంగళ బజార్, సంత మార్కెట్ ప్రాంతాలు చెరువులను తలపిస్తూ పల్లపు ప్రాంతాలు జలమయమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పనుల తీరుపై మరియు అధికారుల నిర్లక్ష్యంపై 17వ వార్డు కౌన్సిలర్ పమిడి గీత శ్రీ పమిడి లక్ష్మణరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళన చెందారు. అధికారులు చేపడుతున్న ఈ శాస్త్రీయత లేని నిర్మాణాల వల్ల తమ వార్డు తీవ్రంగా నష్టపోతుందని ఆమె హెచ్చరించారు. ఈ చెరువు గట్టును అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా ఇలాగే వేసుకుంటూ పోతే, రాబోయే వర్షాకాలంలో తన 17వ వార్డు మొత్తం చెరువును తలపించే ప్రమాదం ఉందని, నీరు బయటకు పోయే మార్గం లేక ఇళ్లలోకి నీళ్లు చేరి ప్రజలు తీవ్ర అవస్థలు పడతారని ఆమె స్పష్టం చేశారు. దయచేసి అధికారులు తక్షణమే స్పందించి సరైన ప్రణాళికతో పనులు చేపట్టాలని, తన 17వ వార్డును, అక్కడ ఉన్న వేలాది మంది ప్రజలను రాబోయే ముంపు ప్రమాదం నుండి కాపాడాలని కౌన్సిలర్ పమిడి గీత శ్రీ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆవేదనతో విన్నవించుకున్నారు.

చెరువులోకి నీరు వచ్చే మార్గాలు , నీరు బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉన్నాయో లేదో నిర్ధారించకుండానే పనులు ప్రారంభించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటివరకు రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే వివరాలను బహిరంగపరచకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమణదారులను కాపాడేందుకే అధికారులు ఉమ్మడి సర్వే మ్యాప్‌ను బయటపెట్టడం లేదని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మరియు స్థానిక ప్రజలు అధికారుల ముందు పలు స్పష్టమైన డిమాండ్లను ఉంచారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం వద్ద భారీ పైపులు లేదా తోరలు ఏర్పాటు చేసి వర్షపు నీరు ఎలాంటి అడ్డంకి లేకుండా చెరువులోకి చేరేలా చర్యలు తీసుకోవాలని, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో కాలువలపై ఉన్న ఆక్రమణలను వెంటనే రెవెన్యూ శాఖ తొలగించాలని డిమాండ్ చేశారు.అలాగే పూడిపోయిన తూములను,డ్రైనేజీ మార్గాలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయాలని, రెవెన్యూఇరిగేషన్ ఉమ్మడి సర్వే మ్యాప్‌ను ప్రజల ముందు ఉంచి పారదర్శకత నిరూపించుకోవాలని కోరారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణంలో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్దాలని లేనిపక్షంలో, రాబోయే వర్షాకాలంలో అశ్వారావుపేట పట్టణానికి కానీ, 17వ వార్డుకు కానీ ఎలాంటి ముంపు సంభవించినా దానికి సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఉన్నత ఇరిగేషన్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని, రైతు ప్రయోజనాలను, పట్టణ ప్రజల ప్రాణ ఆస్తులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



## విద్యార్థులపై లాఠీఛార్జ్,రాహుల్ గాంధీ అరెస్టు

- ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం
- ఎన్.ఎస్.యు.ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్

**భద్రాద్రి కొత్తగూడెంబ్యూరో,తెలంగాణ చౌరస్తా:**

భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్.ఎస్.యు.ఐ) జాతీయ అధ్యక్షులు వినోద్ జాకర్ ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం బస్సు నిలయ ప్రాంతంలోని అమరవీరుల స్తూపం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్.ఎస్.యు.ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి, ప్రతి విద్యార్థికి తమ అభిప్రాయాన్ని శాంతియుతంగా వ్యక్తపరచే రాజ్యాంగబద్ధమైన హక్కు ఉందన్నారు. ఆ హక్కును అణచివేసే విధంగా ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేసిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం తీవ్రంగా ఖండించదగ్గ చర్యలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తలారి మధు, ఉర్సు శివ, బానోత్ శ్రీధర్, షేక్ సమీర్, కాటి సందీప్, ఎస్.కె నయన్, ఉబ్బపల్లి నికిల్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కథల పోటీలో రంగనాథ్‌కు ద్వితీయ బహుమతి

- 'కాఫిర్' కథకు రూ. 25,000 నగదు పురస్కారం
- ప్రజాకవి జయరాజు చేతుల మీదుగా రంగనాథ్ సన్మానం



**ఇల్లందు, భద్రాద్రి బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

ఇల్లందు సుందరయ్య నగర్‌కు చెందిన విద్యావేత్త, సింగరేణి కార్మికుడు, యువ రచయిత సుదర్శనం రంగనాథ్ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని సాధించారు. నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలలో ఆయన రాసిన 'కాఫిర్' కథ ద్వితీయ స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా వచ్చిన 480 కథలలో 'కాఫిర్' విశిష్టత చాటుకొని రూ. 25,000 నగదు పారితోషికానికి ఎంపికైంది. జులై 19న ముల్కనూరులో నిర్వహించిన అభినందన సభలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రజాకవి జయరాజు చేతుల మీదుగా రంగనాథ్ సన్మానం పొంది, జ్ఞాపికతో పాటు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. సాహిత్యం సమాజాన్ని చైతన్యపరచాలని, మత విద్వేషాలు, మూఢాచారాలు, వర్గ దోపిడీ వంటి సామాజిక రుగ్మతలను ఎండగట్టేలా రచయితలు బాధ్యతాయుతంగా రచనలు చేయాలని పిలుపునిచ్చారు.

## ఫోటోలు తీసుకున్నారు కదా... బయటకు వెళ్లండి

- ఏన్కూర్ ఘటనపై జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర చర్చ
- మీడియా పట్ల అదనపు కలెక్టర్ వ్యవహారశైలిపై జర్నలిస్టుల ఆవేదన
- ప్రజా ప్రయోజన సమావేశాల్లో మీడియాకు తగిన గౌరవం కల్పించాలని విజ్ఞప్తి
- సమావేశం నుంచి విలేకరులను బయటకు పంపడంపై జర్నలిస్టుల అసంతృప్తి
- ప్రభుత్వ కార్యక్రమాల కవరేజీని అడ్డుకోవడం సరికాదంటున్న మీడియా ప్రతినిధులు
- ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియాను గౌరవించాలని పిలుపు



**తెలంగాణ చౌరస్తా, ఏన్కూర్:**

ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలంలోని రైతు వేదికలో ఈరోజు అదనపు కలెక్టర్ శ్రీజా అధ్యక్షతన మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని కవర్ చేసేందుకు స్థానిక మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో ఫోటోలు, వీడియోలు చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులను ఉద్దేశించి అదనపు కలెక్టర్ "ఫోటోలు తీసుకున్నారు కదా... బయటకు వెళ్లండి" అని చెప్పినట్లు అక్కడ ఉన్న విలేకరులు తెలిపారు. దీంతో సమావేశాన్ని పూర్తిస్థాయిలో కవర్ చేయడానికి వచ్చిన మీడియా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, అధికారుల నిర్ణయాలను పారదర్శకంగా చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని జర్నలిస్టులు పేర్కొన్నారు. అలాంటి మీడియా ప్రతినిధులను సమావేశం నుంచి బయటకు పంపించడం బాధాకరమని, ఇది సమాచార హక్కు, పారదర్శక పరిపాలన స్ఫూర్తికి విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ అధికారులు మీడియాను ప్రజలకు సమాచారాన్ని అందించే వారధిగా గుర్తించి గౌరవప్రదంగా వ్యవహరించాలని, అధికారిక సమావేశాలకు తగిన కవరేజ్ అవకాశం కల్పించాలని జర్నలిస్టులు కోరుతున్నారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను పరిశీలించి, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిన నేపథ్యంలో, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన సమావేశాల్లో మీడియా స్వేచ్ఛకు భంగం కలగకుండా అధికారులు వ్యవహరించడం అత్యంత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.




## మధిరలో కేంద్రీకృత కమ్యూనిటీ కిచెన్

- కిచెన్ ను పరిశీలించిన ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు
- విద్యార్థులకు నాణ్యమైన,పోషకాహారం అందించడమే లక్ష్యం

**మధిర, తెలంగాణ చౌరస్తా:**

మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రీకృత కమ్యూనిటీ కిచెన్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బండారు నరసింహారావు, మధిర మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ పాల్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కిచెన్‌లో జరుగుతున్న వంట ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, ఆహార తయారీలో పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రత, ఆహార భద్రత చర్యలపై హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు వండిన ఆహారాన్ని సమయానికి ఎలా చేరవేస్తున్నారు, పంపిణీ వ్యవస్థ, పారిశుద్ధ్య ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రమైన వంటశాల నిర్వహణ, ఆహార భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు మాట్లాడుతూ, ఈ కేంద్రీకృత కమ్యూనిటీ కిచెన్ ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం సకాలంలో అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. మధిరతో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 50 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈ కేంద్రం ద్వారా అల్పాహారం, భోజనం పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారని చెప్పారు. అత్యాధునిక వంట సౌకర్యాలు, శాస్త్రీయ విధానంలో ఆహార తయారీ, పరిశుభ్రమైన ప్యాకింగ్, వేగవంతమైన రవాణా వ్యవస్థతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఈ కమ్యూనిటీ కిచెన్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌కేఎం చారిటబుల్ ఫౌండేషన్ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

- ప్రజలు కాంగ్రెస్ ని ప్రతిపక్ష పార్టీగా గుర్తించడం లేదు
- విద్యార్థుల కోసం కాదు, కాక్రోచ్ పార్టీకి పోటీగా,
- కాంగ్రెస్ పార్టీ నిరసనలు చేస్తుంది
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్






**వరంగల్, తెలంగాణ చౌరస్తా:** తెలంగాణ విద్యార్థుల కోసం ఆలోచించని మంత్రులు సీఎం రేవంత్ రెడ్డి ధర్నాలో పాల్గొనడం సిగ్గుచేటు అని,అధికారంలో ఒకలా.. ప్రతిపక్షంలో మరోలా.. కాంగ్రెస్‌వి పచ్చి అవకాశవాద రాజకీయాలు చేయడం ఏంటని,ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెస్ విధ్వంసాలు..రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడమే ధ్యేయమా ? అంటూ వరంగల్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసి,కాంగ్రెస్ అరాచకాలపై బీజేపీ పోరాటం ఆగదన్న జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.ఈ సందర్భంగా మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ తీరుకు నిరసనగా వరంగల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు భారీ నిరసన చేపట్టారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు, కార్యకర్తలు దగ్ధం చేశారు.12 వేల కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని తెలంగాణ విద్యార్థులు ఆరిగోసపడుతున్న పట్టించుకోని మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీ ఎన్ని డ్రామాలాడిన ప్రజలు పట్టించుకోవడం లేదని,కాంగ్రెస్ పార్టీ డ్రామాలాపి ప్రజల కోసం ఆలోచించాలని,విద్యార్థుల నిరసనల పేరుతో కాంగ్రెస్ పార్టీ చేరుస్తున్న విధ్వంసాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని,అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొకలా మాట మార్చి ప్రజలను ఏమార్చడం ఒక్క కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా దిగజారుతుందని విమర్శించారు.తెలంగాణలో ఏదైనా ఎలీనినో ఎఫెక్ట్ తో వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతుంటే కనీసం సాగునీళ్లు అందించాలని సోయిలేని కాంగ్రెస్ మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి దద్దమ్మల వ్యవహరిస్తున్నారని,ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ శ్రేణులు అరాచక మూకల్లా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు.ఒకవైపు దేశ రాజధానిలో ప్రజాస్వామ్యం ముసుగులో విధ్వంసాలు సృష్టిస్తూ, మరోవైపు రాష్ట్రంలో మాత్రం పోలీసుల అండతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడటం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వానికి, ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక, అరాచక విధానాలపై భారతీయ జనతా పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా,రాష్ట్ర నాయకులు గందె నవీన్,జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్,జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, బైరి నాగరాజు, జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, గోకే వెంకటేష్,మాచర్ల దీన్ దయాళ్,బైరి శ్యాం సుందర్, కూచన క్రాంతి కుమార్, మాదాసు రాజు,టేకుమట్ల రేణుక, పైర్ద ఆనంద్,అంకాల జనార్ధన్,నోముల రతన్,కర్నే రవీందర్,షేర్ల అనిల్ కుమార్, కొంతం సంగీత్,మండల అధ్యక్షులు సీతా నాగరాజు, అపురూప రజనీష్,బిజెపి నాయకులు మార్త ఉషారాణి, రేపల్లె స్వర్ణజ,అల్లి అజయ్, ముద్దసాని కృష్ణ,మెంగాని నరేష్, ముత్తినేని శ్రీనివాస్,మోహనా చారి,బీజేవైఎం,మహిళా మోర్చా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం సిగ్గుచేటు

- నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ...
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరు సతీష్ కుమార్



**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష పేపర్ లీక్‌పై నిష్పక్షపాతమైన,సమగ్ర దర్యాప్తు జరపాలని,అలాగే నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరు సతీష్ కుమార్ తీవ్రంగా ఖండించారు .ఈ పోలీసు చర్య దురదృష్టకరమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.... నీట్ పేపర్ లీక్ ఘటన దేశంలోని విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉన్న నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీసిందని అన్నారు. ప్రభుత్వ పరీక్షల విశ్వసనీయతపై విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలు విద్యా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని తెలిపారు. నిజానిజాలను వెలికితీసేందుకు పారదర్శకమైన దర్యాప్తు జరిపి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాల్సిన కేంద్ర ప్రభుత్వం,తమ ప్రజాస్వామ్య హక్కైన నిరసనను వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసు బలాన్ని ప్రయోగించడం తీవ్రంగా ఖండించదగినన్నారు.జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం,పలువురు విద్యార్థులు గాయపడినట్లు సమాచారం రావడం,అలాగే టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా అభివర్ణించారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని,ఆ హక్కును అణచివేయడానికి ప్రభుత్వం చేసే ఏ ప్రయత్నమైనా ప్రజాస్వామ్య స్ఫూర్తికివిరుద్ధమని స్పష్టం చేశారు.
నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనపై సమగ్ర,స్వతంత్ర, పారదర్శక దర్యాప్తు జరిపి అసలు నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని,బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అదే విధంగా,ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై నమోదు చేసిన అన్ని కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పిఆర్టియు ధ్యేయం

- సమస్యల పరిష్కారానికి కృషి
- పిఆర్టియు టీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి
- సభ్యత్వ నమోదు కార్యక్రమం

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పి.ఆర్.టి.యు.టీ.ఎస్. తోనే సాధ్యమని అందుకోసం సభ్యత్వ నమోదును పెంచాలని రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి కోరారు .సంఘ సభ్యత్వ నమోదులో భాగంగా శ్రీరాంపూర్ మండలంలోని కేజీబీవీ పాఠశాలలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు.ఉపాధ్యాయులకు హెల్త్ కార్డు నిన్నటి నుండి ప్రారంభమైందని పకడ్బందీగా దాన్ని అమలు చేయుటకు తోడ్పడుతామని తెలిపారు అదేవిధంగా రాబోయే రెండు నెలల్లో పిఆర్సి సాధించి తీరుతామని అదేవిధంగా సిపిఎస్ ఉద్యోగులకు పెండింగ్ బిల్స్ తో పాటు సిపిఎస్ రద్దు దిశగా కార్యాచరణ ఉంటుందని తెలిపారు. అదే విధంగా జిల్లా అధ్యక్షులు గండు కృష్ణమూర్తి మాట్లాడుతూ... మోడల్ స్కూల్స్ ను డి.ఎస్.ఈ.లో విలీనం చేయాలని,కేజీబీవీ ఉపాధ్యాయునులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింపచేయుటకు కృషి చేస్తామని సమస్యల పరిష్కారానికి సంఘం తోడ్పడుతుందని తెలిపారు.. పాఠశాలల అభివృద్ధి తోపాటు ఉపాధ్యాయులను సమస్యల పరిష్కారం పి.ఆర్.టి.యు తో సాధ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గండు కృష్ణమూర్తి , శ్రీరాంపూర్ మండల శాఖ అధ్యక్షులు ముంజాల హరికృష్ణ గౌడ్ ,ప్రధాన కార్యదర్శి కడారి నవీన్ ,మోడల్ స్కూల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుముల పోచయ్య , కేజీబీవీ ఎస్.ఓ. శ్రీదేవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గైని రమేష్, జిల్లా బాధ్యులు పందిపెల్లి సదయ్య, గందె శ్రీకాంత్ ,పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు అమానుషం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు
- నిరసన ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు
- ప్రతిపక్ష గొంతును అణచివేసే చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం




**మధిర, తెలంగాణ చౌరస్తా:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమం సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ బండారు నరసింహారావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. అలాంటి రాజ్యాంగబద్ధమైన హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజల తరపున ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. దేశంలోని యువత, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీపై ఇటువంటి చర్యలు చేపట్టడం ద్వారా ప్రజల గొంతును అణచివేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణిని విడనాడి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, ప్రతిపక్ష నాయకులపై వేధింపులు, అక్రమ అరెస్టులు వంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విభిన్న అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రజల స్వేచ్ఛా హక్కులను హరించే చర్యలు దేశ ప్రజాస్వామ్యానికి హానికరమని బండారు నరసింహారావు పేర్కొన్నారు.



# ఉప సర్పంచుల కమిటీ ఎన్నిక

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా:** కాసిపేట మండలంలోని కొండాపూర్ పంచాయతీలో మండల ఉపసర్పంచ్ సంఘం నూతన కమిటీని ఎనుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొడప అనంతరావు, ఆల్క రాజు, ముఖ్య సలహాదారుగా కూకట్ల దేవేందర్, ఉపాధ్యక్షుడిగా మెండ్రపు రాజన్న ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను డిసిసి జనరల్ సెక్రెటరీ వేముల కృష్ణ సన్మానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉప సర్పంచ్లు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఉప సర్పంచ్ల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పార్వతి మల్లేష్, శేఖర్ రావు, ఉప సర్పంచ్లు బానోతు పరుశురాం, జంజీరాల సందీప్, శంకర్, సీతారాం, మోతీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమృత న్యూరో లో ఘనంగా ప్రపంచ మెదడు దినోత్సవం

**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:** ప్రపంచ మెదడు దినోత్సవాన్ని పురస్కరించుకుని అమృత న్యూరో హాస్పిటల్,జమ్మికుంటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ ఏడాది ప్రపంచ మెదడు దినోత్సవం థీమ్ " బ్రేన్ హెల్త్ ఆక్సిస్ ఫర్ ఆల్ " (మెదడు ఆరోగ్యం - అందరికీ అందుబాటులో) గా ప్రపంచ న్యూరాలజీ సమాఖ్య (WFN) ప్రకటించింది.ఈ సందర్భంగా డా. భరత్ ఆర్ (MBBS, MD, DM Neurology), న్యూరో ఫిజీషియన్ మాట్లాడుతూ...ప్రపంచవ్యాప్తంగా సుమారు 3.4 బిలియన్ మంది ఏదో ఒక నాడీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. స్ట్రోక్, మూర్ఛ (ఎపిలెప్సీ), మైగ్రేన్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స పొందితే ప్రాణాలను కాపాడటంతో పాటు శాశ్వత వైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, రక్తపోటు,మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడం, ధూమపానం,మద్యపానానికి దూరంగా ఉండడం,క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు."మెదడు ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు. మెదడు ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా అవగాహన పెంపొందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత" అని డా. భరత్ ఆర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అమృత న్యూరో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్ రెడ్డి,ఎన్ సి ఎస్ టెక్నీషియన్ ప్రశాంత్, ల్యాబ్ టెక్నీషియన్లు అఖిల్, శ్రావణి,పి ఆర్ వో లు శ్రీకాంత్, రంజిత్, నర్సింగ్ సిబ్బంది, రిసెప్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా దాశరథి జయంతి

- ప్రధానోపాధ్యాయురాలు విజయ

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ లో ప్రముఖ తెలంగాణ ఉద్యమ కవి,రచయిత దాశరథి కృష్ణమాచార్య జయంతి ఘనంగా నిర్వహించారు.పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 22 వ తేదీన ఆయన జయంతి నిర్వహించుకుంటారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించిన మహాకవి ఆయన. తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి.పలు సినిమాలకు గేయరచయితగా పని చేశారు. ప్రతి సంవత్సరం దాశరథి జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సాహిత్యరంగంలో కృషిచేసినవారికి తెలంగాణా ప్రభుత్వం దాశరథి సాహితీ పురస్కారం అందజేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాను ప్రకాష్,మంగళ,నిర్మల,లక్ష్మణ్,నరసింహ,ప్రతాప్,శశిరేఖ,శ్రీదేవి,సాయికిరణ్,సంగీత,వెంకటేష్ పాల్గొన్నారు.




# అశ్వారావుపేటలో కేటీఆర్ ముందస్తు జన్మదిన వేడుకలు

- చిన్నారులకు ఉచిత పానీపూరి పంపిణీ
- కాసాని, భూక్యా దంపతుల ఉదారత



**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:** అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాభారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేటలోని గెస్ట్ హౌస్ సమీపంలో ముందస్తుగా వినూత్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజం పట్ల ఉన్న సేవా గుణంతో కాసాని దంపతులు మరియు భూక్యా దంపతుల ఆర్థిక సహకారంతో చిన్నారులకు ఉచితంగా పానీపూరి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోటూరి మోహన్ కుమార్తె ఇవాంక చిన్నారులకు స్వయంగా పానీపూరి అందజేసి కేటీఆర్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ప్రసాద్ రావు, చంద్రమోహన్ పూర్తి సహకారం అందించారు. కేటీఆర్ ముందస్తు జన్మదినాన్ని ఇలాంటి సేవా గుణంతో కూడిన వినూత్న కార్యక్రమం ద్వారా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. పెద్ద సంఖ్యలో హాజరైన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పానీపూరి స్వీకరించారు.ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కేటీఆర్ చేసిన సేవలను నాయకులు, అభిమానులు గుర్తు చేసుకున్నారు. ముందస్తుగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, మరెన్నో పుట్టినరోజులు జరుపుకుని ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కేటీఆర్ అభిమానులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దూరదృష్టితోనే జిల్లాకు సీతారామ ప్రాజెక్టు జలాలు

- వైరా నియోజకవర్గం నాయకులు బాదావత్ బాలాజీ
- సీతారామ ప్రాజెక్టు నిర్మాణంతో ఖమ్మం జిల్లాకు శాశ్వత సాగునీటి భరోసా
- ప్రస్తుతం రోజుకు 1,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నామని వెల్లడి
- కేసీఆర్ కృషిని రైతులు ఎప్పటికీ మరువరని వ్యాఖ్య



**వైరా, తెలంగాణ చౌరస్తా:** ఖమ్మం జిల్లాకు నేడు సీతారామ ప్రాజెక్టు ద్వారా అందుతున్న సాగునీరు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) దూరదృష్టి, కృషి ఫలితమేనని వైరా నియోజకవర్గ నాయకులు బాదావత్ బాలాజీ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టి వేగవంతంగా పనులు చేపట్టడం వల్లే ప్రస్తుతం రోజుకు సుమారు 1,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే అవకాశం కలిగిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం లేకపోయి ఉంటే ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించే పరిస్థితి ఉండేదే కాదని వ్యాఖ్యానించారు.సీతారామ ప్రాజెక్టు ఖమ్మం జిల్లా రైతాంగానికి జీవనాడిగా మారిందని, వేలాది ఎకరాలకు సాగునీరు అందించే స్థాయికి చేరుకోవడం కేసీఆర్ ముందుచూపుకు నిదర్శనమని అన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని చేపట్టిన ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాలో వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరిగిందని తెలిపారు.ఖమ్మం జిల్లా రైతులు నేడు పొందుతున్న సాగునీటి ప్రయోజనాలు కేసీఆర్ తీసుకున్న నిర్ణయాల ఫలితమేనని, సీతారామ ప్రాజెక్టు ద్వారా అందుతున్న ప్రతి నీటి బొట్టు ఆయన రైతాంగంపై చూపిన చిత్తశుద్ధికి నిదర్శనమని బాదావత్ బాలాజీ పేర్కొన్నారు.



# నీట్ పరీక్షల లీకేజీపై మోదీ మౌనం వీడాలి

- విద్యార్థుల పక్షాన ప్రశ్నిస్తున్నా రాహుల్ గాంధీ అరెస్టు అమానుషం
- రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసన నూతనకల్‌లో కాంగ్రెస్ శాంతియుత ధర్నా

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై జరిగిన దాడి, అరెస్టును ఖండిస్తూ ఏఐసీసీ, టిపిసిసి పిలుపు మేరకు నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అలాగే నీట్ ప్రశ్నపత్రాల లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు.నీట్ పరీక్షల లీకేజీపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడవద్దని హెచ్చరిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.
ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దరిపెల్లి వీరన్న, బొడ్డుపల్లి అంజయ్య, భూరెడ్డి సంజీవరెడ్డి, పగిళ్ల అశోక్ రెడ్డి, చురకంటి చంద్రారెడ్డి, గొరుగంటి రామకిషన్, జటంగి గణేష్ యాదవ్, లింగాల రామచంద్రయ్య, పాండవులు లింగన్న, బాణాల మల్లారెడ్డి, మద్దెల సురేందర్ గౌడ్, బొల్క సైదులు యాదవ్, బంటు బద్రి, దేశపంగు మురళి, బంటు క్రాంతి, చిర్ర శ్రీనాథ్ గౌడ్, ముల్కలపల్లి గణేష్, బొల్లెద్దు నాగయ్య, నకిరకంటి వీరబాబు, మరికంటి రమేష్, యాకూబ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.